TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 78 | పేజీలు : 05| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | జులై 02, 2026




## రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్ల పర్వం

- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత
- హరీశ్‌రావు అరెస్ట్
- గన్‌పార్క్ చర్చకు బయల్దేరిన మాజీ మంత్రిని అడ్డుకున్న పోలీసులు
- తోపులాటలో కిందపడ్డ హరీశ్‌రావు..
- పోలీస్ వాహనంలోకి బలవంతంగా తరలింపు
- అమరవీరుల స్థూపం వద్ద బైఠాయించిన మంత్రులు పొన్నం, లక్ష్మణ్, అజారుద్దీన్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా తీవ్ర సంచలనంగా మారాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య చెలరేగిన సవాళ్లు, ప్రతిసవాళ్ల పర్వంతో రాజధాని హైదరాబాద్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చకు రావాలంటూ ఇరుపక్షాలు విసిరిన సవాళ్లతో పాలిటిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. ఈ నేపథ్యంలో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద చర్చకు బయలుదేరిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును పోలీసులు తెలంగాణ భవన్ వద్దే బలవంతంగా అడ్డుకుని అరెస్ట్ చేయడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అంతకుముందు, కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో సహా వివరించడానికి తాను సిద్ధమని, వేదిక వరంగల్ ప్రెస్‌క్లబ్ అయినా, అశోక్‌నగర్ అయినా, అసెంబ్లీ అయినా సరే బీఆర్ఎస్ తరపున తాను వస్తానని, కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ వస్తారో మరెవరొస్తారో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. ఒకవేళ ప్రభుత్వ వైఫల్యాలను లెక్కలతో నిరూపించకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కేటీఆర్ చాలెంజ్ చేశారు. ఈ సవాల్‌పై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ.. తాను గురువారం ఉదయం 11 గంటలకు నేరుగా తెలంగాణ భవన్‌కే వస్తానని ప్రతిసవాల్ విసిరారు. దీనికి బీఆర్ఎస్ స్పందిస్తూ.. తెలంగాణ భవన్‌లో మంత్రి కోసం ప్రత్యేకంగా కుర్చీ సిద్ధం చేశామని, దమ్ముంటే రావాలని పేర్కొంది. ఈ క్రమంలో తెలంగాణ భవన్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని, తానే సరిపోతానని, కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఇలా ఉండగా, గురుకులాల టెండర్లలో జరిగిన అవినీతి మరియు డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారనే ఆరోపణలపై చర్చకు రావాలంటూ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ లు బీఆర్ఎస్ నేతలకు గన్‌పార్కు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి తెలంగాణ భవన్ నుండి గన్‌పార్క్‌కు బయలుదేరారు. తాము శాంతియుతంగా చర్చకే వెళ్తున్నామని, ఎలాంటి గొడవలు వద్దని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## తిరుచ్చి ఉప ఎన్నికపై
## వీడని ఉత్కంఠ..

- రేసులో నటి త్రిష?
- పోటీ నుంచి తప్పుకున్న రాఘవ లారెన్స్
- త్రిష పొలిటికల్ ఎంట్రీపై జోరుగా ప్రచారం
- సీఎం విజయ్ నిర్ణయంపైనే సర్వత్రా ఆసక్తి




## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- చర్చకు పిలిచి కాంగ్రెస్ మంత్రులు పారిపోతున్నారు
- అసత్యాలతో ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావును ఎందుకు అరెస్ట్ చేయించారు?




## సీఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

- మంత్రి సీతక్క నాయకత్వంలో గిరిజన సమస్యలపై వినతి
- ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి




## భట్టితో సీఎస్ మర్యాదపూర్వక భేటీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మధ్యాహ్నం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు క్షేమసమాచారాలు చర్చించారు. సిఎస్‌గా నియమితులయినందుకు జాజును భట్టి అభినందించారు.



వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, జులై 02, 2026

# తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ..

- రేసులో నటి త్రిష?
- పోటీ నుంచి తప్పుకున్న రాఘవ లారెన్స్
- త్రిష పొలిటికల్ ఎంట్రీపై జోరుగా ప్రచారం
- సీఎం విజయ్ నిర్ణయంపైనే సర్వత్రా ఆసక్తి



**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష పేరు మరోసారి తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారని, తిరుచ్చి (తిరుచిరాపల్లి ఈస్ట్) అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున బరిలోకి దిగనున్నారనే వార్త రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త పార్టీ 'తమిళగ వెట్రి కజగం' స్థాపించి, ప్రభంజనం సృష్టించిన నటుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల (పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్) నుంచి పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. అనంతరం నిబంధనల ప్రకారం ఆయన తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మొదట ఈ స్థానం నుండి విజయ్ పార్టీ తరఫున ప్రముఖ నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ బరిలోకి దిగుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. లారెన్స్ సైతం రాజకీయ అరంగేట్రంపై ఆసక్తి కనబరిచినప్పటికీ, చివరి నిమిషంలో ఆయన పోటీ నుండి తప్పుకోవడంతో తిరుచ్చి అభ్యర్థి ఎవరనే సస్పెన్స్ మొదలైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయ్‌కు అత్యంత ఆప్తురాలైన నటి త్రిష పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. విజయ్ స్వయంగా త్రిషను రాజకీయాల్లోకి తీసుకువచ్చి, తన సొంత నియోజకవర్గ బాధ్యతలను ఆమెకు అప్పగించాలనే యోచనలో ఉన్నట్లు తమిళ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ప్రచారంపై ఇప్పటివరకు అటు త్రిష కానీ, ఇటు సీఎం విజయ్ కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు, నటి త్రిష ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇటీవల 'కరుప్పు' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆమె, ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'తో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వయసులోనూ క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్న త్రిష.. ఒకవేళ తిరుచ్చి ఉపఎన్నిక ద్వారా రాజకీయాల్లోకి వస్తే తమిళనాట సరికొత్త సమీకరణాలు మొదలవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంచలన వార్తపై పూర్తి స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్ల పర్వం



- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత
- హరీశ్‌రావు అరెస్ట్
- గన్‌పార్క్ చర్చకు బయల్దేరిన మాజీ మంత్రిని అడ్డుకున్న పోలీసులు
- తోపులాటలో కిందపడ్డ హరీశ్‌రావు..
- పోలీస్ వాహనంలోకి బలవంతంగా తరలింపు
- అమరవీరుల స్థూపం వద్ద బైఠాయించిన మంత్రులు పొన్నం, లక్ష్మణ్, అజారుద్దీన్

**(మొదటి పేజీత తర్వాత..)** అయితే, గన్‌పార్క్‌కు బయలుదేరిన హరీశ్‌రావును తెలంగాణ భవన్ గేటు వద్దే పోలీసులు భారీ బందోబస్తుతో అడ్డుకున్నారు. "ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం.. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయండి, మమ్మల్ని ఎందుకు ఆపుతున్నారు?" అని హరీశ్‌రావు పోలీసులను నిలదీశారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని చర్చల నుండి పారిపోతోందని మండిపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు యత్నించిన హరీశ్‌రావు ఆ తోపులాటలో కిందపడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు హరీశ్‌రావుతో పాటు పలువురు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు, బీఆర్ఎస్ చేసిన ఆరోపణలను తిప్పికొట్టేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, మహ్మద్ అజారుద్దీన్‌లు గన్‌పార్క్‌కు చేరుకుని అమరవీరుల స్థూపం వద్ద కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అక్కడకు వచ్చారు. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నేతలే వెనకడుగు వేశారని మంత్రులు పేర్కొన్నారు. ఈ ఉత్కంఠభరిత పరిణామాల నేపథ్యంలో గన్‌పార్క్, సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్, గాంధీ భవన్ పరిసరాల్లో పోలీసులు మోహరించి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# సీఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

- మంత్రి సీతక్క నాయకత్వంలో గిరిజన సమస్యలపై వినతి
- ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గిరిజన, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో ఆదివాసి, గిరిజన శాసనసభ్యుల బృందం గురువారం అధికారికంగా కలిసింది. ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లోని పలు కీలక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యేలు, వాటి పరిష్కారం కొరకై ఒక సమగ్ర వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన ఎమ్మెల్యేలు ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతి నియోజకవర్గానికి ప్రస్తుత కోటాతో పాటు అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. అలాగే, అర్హులైన గిరిజనులందరికీ పోడు భూముల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, గిరిజన రైతుల భూముల్లో సాగునీటి వసతి కల్పించే 'ఇందిర గిరి జల వికాసం' పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రస్తుతం ఉన్న గ□రిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ (ఉన్నతీకరణ) చేయాలని ఎమ్మెల్యేల బృందం కోరింది. దీనివల్ల గిరిజన పిల్లల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుందని వివరించారు. అలాగే, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలైన ఐటీడీఏలను మరింత బలోపేతం చేసి, అదనపు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి సీతక్కతో పాటు అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, మహ్మద్ అజారుద్దీన్ కూడా పాల్గొని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై చర్చించారు.

# సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- చర్చకు పిలిచి కాంగ్రెస్ మంత్రులు పారిపోతున్నారు
- అసత్యాలతో ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావును ఎందుకు అరెస్ట్ చేయించారు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిలదీత



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "అసత్యాలతో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే తెగువ ఈ సర్కార్‌కు లేదు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అప్పుల విషయంలో దమ్ముంటే చర్చకు రావాలని గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా సవాల్ విసిరారని కేటీఆర్ గుర్తుచేశారు. "సీఎం సవాల్‌ను స్వీకరించి తాము ప్రెస్‌క్లబ్‌కు వెళ్తే.. మరి ముఖ్యమంత్రి ఎందుకు రాలేదు? ఎక్కడైనా, ఏ విషయంపైనైనా చర్చించడానికి తాము సిద్ధమని స్పష్టం చేసినా.. సవాల్ విసిరిన ముఖ్యమంత్రే వెనకడుగు వేసి పారిపోయారు" అని ఎద్దేవా చేశారు. ఈ వివాదంలోకి మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో వచ్చి సవాల్ విసిరారని కేటీఆర్ పేర్కొన్నారు. "ముఖ్యమంత్రే స్వయంగా పంపించారేమో అనుకుని జూపల్లి వస్తారని తాము భావించాం. కానీ ఆయన పనికిమాలిన డైలాగులు కొడుతున్నారు తప్ప చర్చకు రావడం లేదు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది" అని వ్యంగ్యంగా విమర్శించారు. సవాల్ చేసిన నేతలే గన్‌పార్కుకు రమ్మన్నారని, తీరా మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని కేటీఆర్ నిలదీశారు. చేతకాని వాళ్లు సవాళ్లు విసరడం ఎందుకని, శాంతియుతంగా వెళ్తున్న ప్రతిపక్ష నేతలను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రభుత్వ పిరికితనానికి



నిదర్శనమన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర పరిస్థితిపై మాట్లాడేందుకు వీలుగా తనకు కనీసం గంట సమయం ఇవ్వాలని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, జులై 02, 2026

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచే కౌంట్ డౌన్ షురూ

- కల్వకుంట్ల కవిత
- బోడుప్పల్ భూ పోరాటంలో తీవ్ర ఉద్రిక్తత..
- టీఆర్ఎస్ చీఫ్ కవిత అరెస్ట్
- బండరాళ్లపై పడేసి, కారు డోరుకేసి కొడుతూ పోలీసుల అమానుషం
- ఉద్యమకారులు, నాయకులు, జర్నలిస్టులపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్
- బొల్లారం పీఎస్ వద్ద ఉద్రిక్తత..
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన పరిసరాలు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం బోడుప్పల్‌లో చేపట్టిన భూ పోరాటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పట్ల పోలీసులు అత్యంత అమానుషంగా వ్యవహరించారు. కవితను అరెస్ట్ చేసే క్రమంలో పోలీసులు తీవ్ర ఓవరాక్షన్ చేస్తూ.. ఆమెను చేతులపై అమాంతం ఎత్తుకెళ్తూ తోపులాటలో పెద్ద పెద్ద బండరాళ్లపై పడేశారు. తోపులాట తాకిడికి పోలీసులు కూడా ఆమెపై పడటమే కాకుండా, కారు డోరుకు బలంగా ఢీకొట్టడంతో కవిత తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ ప్రతిఘటించిన టీఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు, చివరకు విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై కూడా పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేసి రక్తాలు వచ్చేలా కొట్టారు. అనంతరం కవితను బలవంతంగా వాహనం ఎక్కించి బొల్లారంపోలీస్ స్టేషన్‌కు తరలించి గంటల తరబడి నిర్బంధించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో కవిత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే లాఠీఛార్జ్ చేసి రక్తాలు వచ్చేలా కొడతారా? కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాల్టి నుంచే కౌంట్ డౌన్ షురూ అయింది” అని ఆమె హెచ్చరించారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని లాఠీలు విరిగినా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కవిత అరెస్ట్ వార్త తెలియడంతో వేలాది మంది తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు పీఎస్ వద్దకు చేరుకుని బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేస్తూ స్టేషన్ పరిసరాలను హోరెత్తించారు. అంతకుముందు, నిన్న రాత్రి నుంచే కవితను హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసం చుట్టూ భారీగా మోహరించారు. అయినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి కవిత తెల్లవారుజామునే బోడుప్పల్‌లోని హెచ్ఎండీఏ భూముల వద్దకు చేరుకున్నారు. అక్కడ వేలాది మంది ఉద్యమకారులతో కలిసి భూ పోరాటాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతానికి ‘తెలంగాణ ఉద్యమకారుల రక్షణ కాలనీ’గా నామకరణం చేసి, అక్కడే బొడ్రాయిని ప్రతిష్టించి, బోనం ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక నుంచి ఈ భూములు ఉద్యమకారులవేనని ఆమె ప్రకటించారు.

### ఎక్కడికక్కడ నిర్బంధాలు..

తెలంగాణ రక్షణ సేన తలపెట్టిన ఈ భూపోరాటాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం నిన్న రాత్రి నుంచే అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ శ్రేణులను, ఉద్యమకారులను అదుపులోకి తీసుకుంది. బోడుప్పల్ వైపు రాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి నిర్బంధించారు. ఉదయం భూపోరాట స్థలంలో వేసిన టెంట్లను సైతం పోలీసులు బలవంతంగా తొలగించి, ఉద్యమకారులను దుర్భాషలాడుతూ లాఠీలతో కొట్టారు. అయినప్పటికీ ఉదయం 9 గంటలకే వేలాది మంది ఉద్యమకారులు క్షేత్రస్థాయికి చేరుకుని, ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేశారు. ఉద్యమకారులకు వెంటనే 250 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. వందలాది మందిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పటికీ, ప్రభుత్వ అణచివేతపై ఉద్యమ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూల్ బస్సులు సీజ్

- విద్యార్థుల భద్రతతో ఆటలాడితే కఠిన చర్యలు
- యాజమాన్యాలకు ఎంవీఐ వంశీధర్ హెచ్చరిక



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పాఠశాలలు, కళాశాలల బస్సులు రవాణా శాఖ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడితే కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్ విద్యాసంస్థల యాజమాన్యాలను హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద వివిధ విద్యాసంస్థల బస్సులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి ఫిట్‌నెస్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు పాఠశాలల బస్సులను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ వంశీధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతే తమకు పరమావధి అని, అందుకోసం బడి బస్సులపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రతి బస్సులో కచ్చితంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్, తాగునీటి సదుపాయం, అత్యవసర ద్వారం అందుబాటులో ఉండాలని సూచించారు. వాహనం నడిపే డ్రైవర్‌తో పాటు విద్యార్థుల కోసం బస్సులో తప్పనిసరిగా ఒక అటెండర్ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున బస్సుల కండిషన్ విషయంలో యాజమాన్యాలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బస్సులకు ఉన్న విండ్‌షీల్డ్ వైపర్లు, రివర్స్ హారన్, లైట్లు ఎల్లవేళలా పనిచేసేలా చూసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా, కండిషన్ సరిగా లేని వాహనాలను రోడ్డెక్కిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, వెంటనే బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. విద్యాసంస్థలు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.


# ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణాభివృద్ధి

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ టౌన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం ముందుకు సాగుతోందని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శరవేగంగా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి మరియు నాణ్యతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించిన ఆయన, ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ సమగ్ర మౌలిక వసతుల కల్పన కొరకై రూ.4 కోట్ల 20 లక్షల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ భారీ నిధులతోనే ప్రస్తుతం పట్టణంలోని పలు వార్డుల్లో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థతో పాటు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని చైర్మన్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ టీఓ అన్వేష్, స్థానిక నాయకులు సాయిని అంజయ్య, మూడపెల్లి నాగరాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# వేములవాడలో వీధి కుక్కల బీభత్సం



**వేములవాడ టౌన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ మితిమీరిపోతోంది. పట్టణంలోని 11వ వార్డు భవాని నగర్‌లో గురువారం ఓ మహిళపై వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఒంటిపై విచక్షణారహితంగా కాటు వేయడంతో సదరు మహిళ రక్తసిక్తమైంది. ఈ హఠాత్ పరిణామంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘోర ఉదంతంపై సమాచారం అందుకున్న మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఫీర్ మహమ్మద్ తక్షణమే మానవత్వంతో స్పందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బాధిత మహిళను తన పర్యవేక్షణలో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యాధికారులతో మాట్లాడి ఆమెకు అత్యవసర వైద్య చికిత్సలు, యాంటీ రేబిస్ ఇంజెక్షన్లు అందేలా చొరవ తీసుకున్నారు. చికిత్స అనంతరం ఆమెను సురక్షితంగా వాహనంలో ఇంటి వద్దకు చేర్చారు. బాధిత మహిళకు వైద్యం చేయించిన అనంతరం ఫీర్ మహమ్మద్ మున్సిపల్ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. భవాని నగర్‌తో పాటు వేములవాడ పట్టణంలోని పలు కీలక ప్రాంతాల్లో వీధి కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోయిందని, చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే వణికిపోతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా తక్షణమే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా, పట్టణంలో వీధి కుక్కల సమస్యకు మున్సిపల్ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపాలని గట్టిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవసాయ పొలంలో నల్ల బెల్లం కలకలం

**7.5 క్వింటాళ్ల నల్ల బెల్లం స్వాధీనం**



**బల్మూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం బాణాలలో భారీగా నల్ల బెల్లం నిల్వలు బయటపడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కేతావత్ రాజేష్‌కు చెందిన వ్యవసాయ పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన నల్ల బెల్లాన్ని అచ్చంపేట ఎక్సైజ్ మరియు జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నాయి. ఈ దాడికి సంబంధించిన వివరాలను అచ్చంపేట ఎక్సైజ్ ఎస్సై సతీష్ వెల్లడించారు. బాణాల గ్రామంలోని సదరు ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవసాయ పొలంలో నాటుసారా తయారీ కోసం నల్ల బెల్లాన్ని భారీగా డంపింగ్ చేశారని ఎక్సైజ్ అధికారులకు ముందస్తుగా పక్కా సమాచారం అందింది. దీంతో జిల్లా ప్రత్యేక బృందం సీఐ రాజ్యలక్ష్మి, అచ్చంపేట ఎస్సై సతీష్ తమ సిబ్బందితో కలిసి సదరు పొలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పొలంలో దాచి ఉంచిన 25 బస్తాల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని బరువు సుమారు ఏడున్నర (7.5) క్వింటాళ్లు ఉంటుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పట్టుబడిన నల్ల బెల్లాన్ని సీజ్ చేసి, బాధ్యులపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే, అధికారిక వర్గాల అండదండలతోనే ఈ దందా సాగుతోందని, కేసు తీవ్రతను తగ్గించి ఈ వ్యవహారంలో ఉన్న ‘అసలు దోషులను’ తప్పించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ బాణాల గ్రామ ప్రజల్లో బలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

# సీఎస్ సంజయ్ జాజును కలిసిన సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేత



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం కోశాధికారి సనాతన బాలస్వామి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సనాతన బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరణించిన, అలాగే పదవీ విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక ఇబ్బందులను సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి, సీపీఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. దీనిపై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని బాలస్వామి తెలిపారు.

# వానకాలం పంటలకు డిండి కుడి కాలువ ద్వారా సాగునీరు విడుదల

- కృష్ణా జలాలను విడుదల చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
- రైతు ప్రభుత్వంలో సాగునీటి రంగానికి పెద్దపీట



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వానకాలం పంటల సాగు కొరకై డిండి ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఉప్పునుంతల మండలం లాత్తిపూర్ గ్రామ పరిధిలోకి కృష్ణా జలాలను అచ్చంపేట ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షులు, డిసిసి అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. 1941లోనే నాటి నిజాం నవాబు ప్రజల సాగునీటి అవసరాలను గుర్తించి రూ.41 లక్షల 80 వేల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. 1943 నాటికి అత్యంత దృఢంగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో.. మిగిలిన బడ్జెట్‌తో బాపని కుంట, చంద్ర సాగర్ రిజర్వాయర్లను కూడా నిర్మించిన చారిత్రక నేపథ్యాన్ని ఆయన రైతులకు వివరించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి, ప్రతి గుంటకు సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసేందుకు భూసేకరణ పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. డిండి రిజర్వాయర్ పరిధిలోని ఉప్పునుంతల మండల రైతాంగానికి సాఫీగా నీరు అందాలనే ఉద్దేశంతో, కాలువల మరమ్మతుల కొరకై రూ.35 లక్షలు మంజూరు చేయించి పనులను పూర్తి చేయించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతు ప్రభుత్వమని, రైతు సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నీటి విడుదల కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, ఉప్పునుంతల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, చైర్మన్లు, యువజన కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం నేత డ్యాగ అనిల్ కుమార్




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ అచ్చంపేట పట్టణంలో విజయవంతమైంది. పట్టణంలోని పలు విద్యాసంస్థలను బంద్ చేయించిన అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది మంది పేద, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపైనే ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. అయితే, గత విద్యా సంవత్సరాలకు సంబంధించిన దాదాపు రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడం అత్యంత విచారకరమన్నారు. ఫీజు బకాయిలు రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీనివల్ల విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలు సాధించలేక తీవ్రంగా నష్టపోతున్నారని అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీవ్రమైన సమస్యపై ఇటీవల న్యాయపరమైన విచారణలు కూడా సాగుతున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వెంకటేష్ ప్రజాపతి, గుద్దటి ఆంజనేయులు, రాజు యాదవ్, సాయి కుమార్, ప్రశాంత్, అలాగే విద్యార్థినులు మమత, గాయత్రి, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లకు త్వరలోనే టెండర్లు

- తుది దశకు చేరిన స్థలాల సేకరణ ప్రక్రియ
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల నిర్మాణం
- మాట నిలబెట్టుకోకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను మరో రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తాం" అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.గోషామహల్ నియోజకవర్గంలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం నాడు మంత్రి పొంగులేటి.. సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, హైదరాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు' అనే మహోన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట కనీసం 500 నుండి 1000 ఇళ్ల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని, అనంతరం రెండు, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని వివరించారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఇవాళ అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలోనే ఎక్కువ ఇళ్లు నిర్మించి చూపిస్తామని, అది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని పునరుద్ఘాటించారు. ఈ సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పందన లేదన్నారు. పేదల ఇళ్ల నిర్మాణంలో కమిషన్లు రావనే ఆలోచనతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్
- రవీంద్రనగర్ బస్తీ దవాఖాన తనిఖీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ రవీంద్రనగర్‌లోని బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానాలోని ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో భాగంగా డీఎంఅండ్‌హెచ్ఓ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను, రోగుల ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. దవాఖానాలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, రోగులకు అవసరమైన ఔషధాల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ల్యాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ వైద్య రికార్డులను, దవాఖానా





పరిసరాల పరిశుభ్రత పరిస్థితులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానకు వచ్చే పేద ప్రజలకు అత్యంత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక సంరక్షణ తీసుకోవాలని, శిశువులకు సకాలంలో టీకాలు వేయాలని సూచించారు. ముఖ్యంగా వానకాలం నేపథ్యంలో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధుల నియంత్రణపై బస్తీ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఎస్పీహెచ్ఓ డాక్టర్ పి.శ్రీధర్, దవాఖానా వైద్యాధికారి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, జులై 02, 2026

# ప్రతి ఒక్కరూ కొత్తగా నమోదు చేసుకోవాలి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** "గతంలో ఓటు వేశాం కదా అని ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదు. పాత ఓటర్ల జాబితా పూర్తిగా రద్దయింది కాబట్టి, అర్హులైన ప్రతి ఒక్కరూ కొత్తగా తమ పేరును నమోదు చేసుకోవాలి" అని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. చారగొండ మండల స్థానిక నాయకులతో నిర్వహించిన ' సర్ ఓటర్ మ్యాపింగ్' ప్రక్రియ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, నాయకులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఓటు నమోదు ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని బీఎల్‌ఓను కలిసి, నిర్దేశిత దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేసి, ఫోటో జతచేసి అందించాలని సూచించారు. ఈ ప్రక్రియలో చదువుకోని వారికి, వృద్ధులకు స్థానిక నాయకులే దగ్గరుండి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు సమర్పించిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా గుర్తుచేశారు. "దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత బిఎల్‌ఓ సంతకంతో పాటు, ఆఫీస్ స్టాంప్ వేసిన కాపీని తప్పకుండా తీసుకోవాలి. స్టాంప్ లేకపోతే ఆ రసీదు చెల్లదు. రేపు ముసాయిదా జాబితాలో ఒకవేళ పేరు రాకపోతే, ఈ రసీదు చూపిస్తేనే మళ్లీ పేరు ఎక్కించడానికి అవకాశం ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితా విడుదలవుతుందని, ఆ తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. సమయం తక్కువగా ఉన్నందున ఈలోపే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును భద్రపరుచుకునేలా నాయకులు క్షేత్రస్థాయిలో చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చారగొండ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబ సభ్యులకు ఆది శ్రీనివాస్ పరామర్శ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ పట్టణ పరిధిలోని శత్రాజ్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగ స్వామి తండ్రి, ఒకటో వార్డు కౌన్సిలర్ సంగ హనుమవ్వ భర్త అయిన సంగ లచ్చయ్య ద్వాదశ దిన కర్మ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగ లచ్చయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కౌన్సిలర్ హనుమవ్వ, సీనియర్ నాయకులు స్వామితో పాటు వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ పరామర్శించి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# 6న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ మరియు అచ్చంపేట ఏరియా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6న పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.తారా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే రోగులకు నిపుణులైన వైద్యులచే ప్రత్యేక కంటి పరీక్షలతో పాటు సాధారణ శారీరక పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం కంటి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి మహబూబ్‌నగర్ ఏనుగొండలోని 'లయన్స్ రామ్‌రెడ్డి కంటి ఆసుపత్రి'లో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు డాక్టర్ తారా సింగ్ వివరించారు. ఆపరేషన్లకు ఎంపికైన రోగులను ఏరియా ఆసుపత్రి నుండి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఉచితంగా ఏనుగొండ ఆసుపత్రికి తరలిస్తారు. శిబిరానికి వచ్చే రోగులు ముందుగానే స్థానికంగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని, ఆ రిపోర్టులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లేదా ఏదైనా ఇతర గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలతో పాటు మొబైల్ నంబర్‌ను అందజేయాల్సి ఉంటుంది. ఆపరేషన్లు పూర్తయిన అనంతరం రోగులను తిరిగి ఈనెల 8న ఉదయం 9గంటలకు అచ్చంపేట ఏరియా ఆసుపత్రి వద్దకు సురక్షితంగా చేరవేస్తారని విశ్రాంత నేత్రాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. అచ్చంపేట డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎన్నికైన ప్రజాప్రతి నిధులతోనే చర్చిస్తాం
- కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు
- బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తెల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆరఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆరఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన డీఎం

- ప్రయాణికుల ఇబ్బందులపై ఆరా



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం నేపథ్యంలో, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సాధకబాధకాలను తెలుసుకునేందుకు అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ స్వయంగా రంగంలోకి దిగారు. అచ్చంపేట డిపోకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎం, గురువారం అచ్చంపేట నుండి నాగర్‌కర్నూల్ వరకు సాధారణ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో ఆయన బస్సులోని మహిళలు, ఇతర ప్రయాణికులతో నేరుగా ముచ్చటించారు. బస్సుల వేళలు, రద్దీ, సిబ్బంది ప్రవర్తన మరియు బస్సుల్లో ఉన్నటువంటి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే అంశాన్ని ఆయన నిశితంగా గమనించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. క్షేత్రస్థాయిలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకే ఈ ఆకస్మిక బస్సు ప్రయాణం చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సూచనల ఆధారంగా బస్సుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని, ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని డీఎం స్పష్టం చేశారు.